క్లుప్తంగా

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



తెనాలిటౌన్: బోసు రోడ్డులోని శ్రీ సాయిబాబా మందిరం వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉదయం బాబాకు ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు జరిపారు. మందిరంలో బాబావారి నిలువెత్తు ఫొటోను ఓంకార్ గ్రాఫిక్స్ సహకారంతో ప్రతిష్టించారు. సాయంత్రం పుర వీధులలో బాబాను పల్లకీపై ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. మందిర కమిటీ అధ్యక్షుడు ఎన్.దుర్గాప్రసాద్, సభ్యులు పర్యవేక్షించారు.

కాశీలో పూజలు



తెనాలిటౌన్: కాశీలో ఈ నెల 22 నుంచి ప్రారంభకానున్న గంగానది పుష్కరాల సందర్భంగా నవదిన పూజల్లో భాగంగా శుక్రవారం మొదటి రోజు పరమ పూజ్యశ్రీ బాల స్వామిజీ ఆధ్వర్యంలో కాశీలో పూజలు జరిపారు. తెనాలికి చెందిన శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్టు సభ్యులు కాశీ వెళ్లారు. మొదటి రోజు శ్రీ గణపతి పూజ, అభిషేకాలు, భక్తులకు కంకణదారణ చేయించారు. గణపతి కల్యాణం, లలిత సహస్ర నామ స్తోత్రం చేయించి బాలస్వామిజీ పూజలు జరిపారు. అలాగే తెనాలి గంగానమ్మ పేటలోని శ్రీ విద్యా పీఠంలో పూజలు చేశారు. మఠం చైర్మన్ నంబూరు కృష్ణమూర్తి, సెక్రటరీ వుప్పల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ రమణయ్య, రాజేశ్వరరావు, రామకృష్ణ, లోకనాథం దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

కఠెవరంలో ప్రకృతి రైతుల ప్రదర్శన




కఠెవరం(తెనాలి): కఠెవరం గ్రామంలో శుక్రవారం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై ప్రకృతి రైతులు ప్రదర్శన చేశారు. రైతుసాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలో గ్రామంలోని ప్రతి రైతు భాగస్వామి కావాలని కోరుతూ గ్రామంలోని రైతులు, మహిళా సంఘాలు ప్రదర్శన నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయం, కఠెవరం యూనిట్‌కు చెందిన జి.విజయకుమారి, ఐసీఆర్పీ కె.రత్నకుమారి, బీఓఎల్.స్వరూపరాణి, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు



తెనాలిఅర్బన్: విఘ్నేశ్వర మెడికల్స్ సహకారంతో తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలోని 87 బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ తెలిపారు. విఘ్నేశ్వర మెడికల్స్ నిర్వాహకులు భార్గవ్ చైతన్య శుక్రవారం 100 ఫస్ట్ ఎయిడ్ కిట్లను డీఎంకు అందజేశారు. ఆర్టీసీ తోడ్పాటుకు సహకారం అందిస్తున్న అధికారులు, దాతలకు డీఎం కృతజ్ఞతలు తెలియజేశారు. భార్గవ్ చైతన్య మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజీలో అవసరమైన వస్తువులను కూడా కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ రఘురామయ్య చేతుల మీదుగా గ్యారేజ్ సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఘురామ్ నాయక్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

కళాకారుడు చిరంజీవికి సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం మేలుకొలుపు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు పసుపులేటి చిరంజీవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మద్దినేని బ్రహ్మానందం, ఖాసిం పఠాన్, పవన్, ముళ్ళపూడి వెంకట్, చందు సుబ్బారావు, మోదుకూరు నాగమల్లేశ్వరరావు, పెమ్మసానీ పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్, సాయి, మస్తాన్ షరీఫ్, పఠాన్ ఆయుబ్ ఖాన్, రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా నిలుస్తున్న సీఎం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విషయాల్లో అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని తెనాలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ఎ-1 ఫంక్షన్ హాల్‌లో గురువారం రాత్రి రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిదేనని చెప్పారు. వైఎస్ కుటుంబం ఆది నుంచి ముస్లిం సంక్షేమానికి ఎన్నో చర్యలు తీసుకుందన్నారు. గత ప్రభుత్వం ముస్లింలకు కనీసం మంత్రి పదవి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం ముస్లింలకు పెద్ద పీట వేస్తోందని శివకుమార్ స్పష్టం చేశారు. తెనాలి నియోజకవర్గంలో ఇచ్చిన మాట ప్రకారం ముస్లిం మైనార్టీలను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నియమించడం జరిగిందన్నారు. ముస్లింలందరూ వైఎస్సార్ సీపీకి అండగా ఉంటున్నారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. షాదీ ఖానాకు రూ.4 కోట్ల నిధులను సీఎం మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో అందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇవి కాకుండా మరో రూ.2 కోట్లు తన నిధుల నుంచి కేటాయించనున్నట్లు ప్రకటించారు. అలాగే ఇమామ్‌లకు త్వరలో ఇళ్ల స్థలాలు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రేమ, శాంతి, త్యాగానికి ప్రతికగా రంజాన్ పండుగ నిలుస్తుందన్నారు. అందరూ సుభిక్షంగా ఉండేందుకు అల్లాని ప్రార్థించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ రియాజ్ ఖాన్, కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. 2024 ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలందరూ పార్టీకి అండగా ఉండి గెలిపించాలని కోరారు. ముందుగా దువ్వా నిర్వహించి ప్రార్థనలు చేశారు. అలాగే ఇమామ్‌లకు నూతన వస్త్రాలను ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. అనంతరం వారికి ఇఫ్తార్ విందు ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, ఈద్గా అధ్యక్షుడు సయ్యద్ గౌస్, మైనార్టీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు దేసు యుగంధర్, సయ్యద్ గౌస్, అక్కిదాసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిఅర్బన్: పట్టణంలోని 34వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పేద ముస్లింలకు రంజాన్ తోఫాను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముస్లిం మైనార్టీలందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అల్లా దయ ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. మున్సిపల్

అప్పలస్వామి గుడిలో చోరీ

తెనాలిరూరల్: పట్టణంలోని అప్పలస్వామి గుడిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోకి శుక్రవారం తెల్లవారుజామున ప్రవేశించిన ఇద్దరు హుండీలను ధ్వంసం చేశారు. గర్భాలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించినా వారికి సాధ్యపడలేదు. ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి చోరీ జరిగినట్టు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఆలయంలోని సీసీ కెమెరాల పుటేజ్‌లను పోలీసులు పరిశీలించారు. ఆలయం వెనుక వైపు గోడ దూకి వచ్చిన ఇద్దరు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. హుండీల్లో సుమారు రూ. 2 వేల నగదు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారుడికి ఆర్థిక సాయం



తెనాలి: జాతీయ హ్యాండ్‌బాల్ జట్టుకు దక్షిణాది రాష్ట్రాల్నుంచి ఎంపికైన ఏకైక తెనాలి క్రీడాకారుడు జెర్రిపోతుల మధుబాబును శుక్రవారం తెనాలి బాబు జగజ్జీవన్‌రామ్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. బల్గేరియా రాజధాని సోఫియాలో ఈ నెల 25 నుంచి అయిదు రోజుల పాటు జరగనున్న మెన్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టు గోల్ కీపర్‌గా మధుబాబు ఆడనున్నారు. ఇదేరోజు రాత్రి బల్గేరియా ప్రయాణం కడుతున్న మధుబాబు ప్రయాణ ఖర్చుల నిమిత్తం జగజ్జీవన్‌రామ్ కమిటీ రూ.30 వేల నగదును సాయంగా అందించింది. కోచ్ కె.నాగరాజును అభినందించారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ లాబీలో జరిగిన కార్యక్రమంలో కమిటీ నేతలు అత్తోట చంటి, మేకల సురేష్, అత్తోట శరత్, పల్లపాటి ప్రేమ్, కొమ్ము రాయల్, అత్తోట శ్యామ్, నలుకుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

24న ఛలో విజయవాడ



తెనాలిటౌన్: కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఈ నెల 24న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెనాలి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు తెలిపారు. మారీసుపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు శేఖర్, జిల్లా జనరల్ సెక్రటరీ శివరామకృష్ణ ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దారా రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కె.బుల్లయ్య, పి.స్టీవెన్‌బాబు, శివన్నారాయణ, శంకరరావు, ఎస్.మల్లికార్జునరావు, శ్రీను, సత్యనారాయణ, వీరాస్వామి, కృష్ణ, మాదవరావు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచ్చేరి



తెనాలి: పట్టణానికి చెందిన సంగీత జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ శ్యామశాస్త్రి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గంగానమ్మ పేటలోని శ్రీ బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలో నిర్వహించిన కర్ణాటక సంగీత కచ్చేరి భక్తులను అలరించింది. విజయవాడకు చెందిన డాక్టర్ చింతలపాటి మంజుల గానం సంగీతాభిమానులకు వీనులవిందు చేసింది. చావలి శ్రీనివాస్ వయొలిన్‌పై కేవీ రామకృష్ణ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు.

నాటుసారా తయారుచేస్తే చర్యలు తప్పవు



నిందితుడు అంకరాజుతో సెబ్ పోలీసులు

నగరం: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా.. కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. పెదమట్లపూడి పంచాయతీ పరిధిలో నాటుసారా తయారీ బట్టీని శుక్రవారం సెబ్ పోలీసులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. పెదమట్లపూడిలోని పోతురాజు స్వామి గుడి వెనక వైపు గల లుక్కా అంకరాజు ఇంటి మరుగుదొడ్డిలో నాటుసారా బట్టీని గుర్తించామన్నారు. బట్టీని ధ్వంసం చేసి రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నాటు సారా తయారు చేస్తున్న అంకరాజును అరెస్ట్ చేసి రేపల్లె సబ్ కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారా విక్రయాలు జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఉపాధ్యాయుడు కోటేశ్వరరావుకు సన్మానం



కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఎంఈఓ నవీన్ కుమార్, సిబ్బంది

చెరుకుపల్లి: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన వారికి గుర్తింపు, గౌరవం దక్కుతుందని, అందుకు నిదర్శనం.. ఉపాధ్యాయుడు మరదాప కోటేశ్వరరావుకు జ్యోతిరావు పూలే జీవిత సాఫల్య ఉపాధ్యాయ అవార్డు దక్కటమే అని ఎంఈఓ టి.నవీన్ కుమార్ అన్నారు. ఆరేపల్లి ఎంపీయూపీ పాఠశాలలో పనిచేస్తున్న కోటేశ్వరరావుకు ఇటీవల తిరుపతిలో ఈ అవార్డును ప్రధానం చేశారు. శుక్రవారం ఆరేపల్లి పాఠశాల ఆవరణలో కోటేశ్వరరావుకు సిబ్బంది అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎంఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. స్త్రీలకు విద్యనందించటంతో పాటు వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అని, అటువంటి గొప్ప వ్యక్తి పేరు మీద కోటేశ్వరరావు అవార్డు అందుకోవటం అభినందనీయమన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావు, రచయిత పగడం వీరాస్వామి రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ పి.గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తాతా సుబ్బారావు, కాటూరి నాగేశ్వరరావు, షంషుద్దీన్, సీఆర్పీ వినీల, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసంస్కర్త భగవత్ రామానుజులు

1006వ తిరు నక్షత్ర మహోత్సవాల్లో డాక్టర్ ఎంటీ ఆళ్వార్‌స్వామి



తిరునక్షత్ర మహోత్సవాల్లో ఆళ్వార్ స్వామి

తెనాలి: 'సమాజ వికాసానికి అడ్డుగా నిలిచే నమ్మకాలు ఎంత ప్రాచీనమైనవి అయినా సరే, మార్చాల్సిందే...మనమూ దారి మార్చుకోవాల్సిందే'నంటూ వెయ్యేళ్ల క్రితమే చాటిన మహా సంస్కర్త భగవత్ రామానుజులు అని ప్రముఖ పండితుడు డాక్టర్ ఎంటీ ఆళ్వార్‌స్వామి చెప్పారు. పట్టణానికి చెందిన శరణాగతి గోష్టి ఆధ్వర్యంలో నరేంద్ర రామానుజదాస స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆరు రోజులుపాటు జరగనున్న శ్రీభగవత్ రామానుజాచార్యులు 1006వ తిరు నక్షత్ర మహోత్సవాలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో యర్రంశెట్టి గంగాధర్, వెంకట రమేష్‌బాబు స్థల ప్రాంగణంలో ఏర్పాటైన వేదికపై జరిగిన ఉత్సవాల్లో భాగంగా 'శ్రీ భగవత్ శ్రీరామానుజుల వారి సంఘ సంస్కరణలు' అనే అంశంపై ఆళ్వార్ స్వామి భక్తులనుద్దేశించి ప్రసంగించారు. విశిష్టాద్వైతం ద్వారా భక్తి, జ్ఞానం పెంపొందించుకోవాలని, కుల, మతాలు లేవని, అందరూ భగవంతుడిని చేరటానికి కృషి చేయాలని రామానుజులు ప్రచారం చేసినట్టు తెలిపారు. ఆ మహనీయుడు చేసిన సంస్కరణలన్నీ భారతీయ సమాజానికి అంతరాత్మలాంటి దేవాలయాల కేంద్రంగా జరిగాయని చెప్పారు. ప్రతి క్షేత్రం కులం కంటే భక్తి ప్రధానమన్న మహత్తర సందేశాన్ని వినిపించిందని వివరించారు. రామానుజుల మాట ఆచరణీయమని సూచించారు. సభానంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

ధరల పెరుగుదల పాపం కేంద్రానిదే



పాండురంగ పేటలో ప్రచార యాత్ర

తెనాలి: దేశ వ్యాప్తంగా పెట్రోలు, డీజిల్‌తో సహా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని సీపీఎం సీనియర్ నేత ములకా శివ సాంబిరెడ్డి విమర్శించారు. గత తొమ్మిదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ, కార్పొరేట్ సంస్థలకు వరాల జల్లు కురిపిస్తోందని ఆరోపించారు. సీపీఐ, సీపీఎం ప్రచార యాత్రలో భాగంగా శుక్రవారం పట్టణ 27వ వార్డులోని పాండురంగ పేట పేదల కాలనీలో ప్రచారం చేశారు. వంట గ్యాస్, కరెంటు బిల్లు, నిత్యావసర వస్తువుల ధరలు పెరగటంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలకు కారణమైన బీజేపీని గద్దె దించేందుకు ప్రజలు ఉద్యమించాలని కోరారు. సీపీఎం నాయకులు షేక్ హుస్సేన్‌వలి, ఎస్.రాజ్యలక్ష్మి, సీపీఐ నాయకులు పల్నాటి నాగరాజు పాల్గొన్నారు.

పాల దిగుబడిపై వడదెబ్బ

- పాడి పశువులకు వడదెబ్బపై రైతులు అవగాహన కలిగిఉండాలి
- వడదెబ్బకు గురైతే చూడి కట్టే అవకాశం లేనట్లే
- ప్రాణాలూ కోల్పోయే ప్రమాదం, పాల ఉత్పత్తిపై ప్రభావం
- వేసవిలో కొద్ది పాటి జాగ్రత్తలతో సంరక్షణ



పశువైద్యాధికారి డాక్టర్ సతీష్‌రాజు



ఆరుబయట ఎండలో ఉన్న గేదెలు

కొల్లిపర: వేసవిలో పాడి రైతులు పశుపోషణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్తున్నారు. వడదెబ్బ తగిలిన పశువు పాల ఉత్పత్తి తగ్గడమే కాక.. ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, చూడుకట్టే అవకాశం ఉండదని కొల్లిపర మండల పశువైద్యాధికారి డాక్టర్ సాయి సతీష్‌రాజు హెచ్చరిస్తున్నారు. వేసవి పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకే వ్యాధులను ఆయన వివరించారు. గేదెలు, ఆవులపై సరైన శ్రద్ధ తీసుకోకుంటే వడదెబ్బకు గురై.. ఒక్కొక్కసారి పశువు చనిపోయే ప్రమాదం ఉందంటున్నారు. పశువైద్యశాలకు వస్తున్న పాడి రైతులకు ఈ మేరకు అహగాహన కల్పిస్తున్నారు.

వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలు...

పశువులు తాగే నీరు స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంచాలి. వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి, నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతాయి. పశువులు ఈ కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీంలోకి చేరి పారుడు వ్యాధి బారిన పడటాయి. రోజులో కనీసం నాలుగు సార్లు నీటిని అందించడం అవసరం. ఆరుబయట తొట్టిలో పగలు నీల్వ ఉన్న నీరు వెచ్చగా మారతాయి. నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు తాగించాలి. ఆవులతో పోలిస్తే గేదెలు ఎక్కువగా నీటిని తాగుతాయి. ఉష్ణోగ్రత, గాలిలో తేమ , పశువు వయస్సు తదితరాల ఆధారంగా రోజుకు సుమారు 35 లీటర్ల నీరు అవసరమవుతాయి. పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి.

వడదెబ్బ తగలకుండా..

పశువుల పాక చుట్టూ పాత గోనెలు, పంచెలు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పాక రేకులతో వేసినట్లయితే పైకప్పును కొబ్బరి, తాటి ఆకు, వరి గడ్డితో కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేట్లు చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే అంటే చల్లని వాతావరణంలోనే మేతకు వదలాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకర జాతి ఆవులకు, గేదెలకు పంకాలు ఏర్పాటు చేయాలి.

లక్షణాలు

శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువులు నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువు చాలా నీరసంగా కనబడుతుంది. ఒక్కొక్కసారి కింద పడి కొట్టుకుని స్పృహకోల్పోతాయి. పశువు నీటి కోసం చూస్తుంటుంది. ఛర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాల ఉత్పత్తి కొల్పోతుంది. ఇటువంటి లక్షణాలు ఉంటే వడ దెబ్బ తగిలిందని రైతు గ్రహించి, దగ్గరలో ఉన్న పశువైద్యులను సంప్రదించాలి.

చేయాల్సి చికిత్స ఇదే..

వడదెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. గుడ్డతో ఐస్ చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి. కొద్దిగా ఊరట కలిగిన తరువాత దగ్గరలోని పశు వైద్యుడిని సంప్రదించి, వైద్యులు సూచించిన విధంగా సెలైన్ పెట్టాలి. అనంతరం వైద్యుల జాగ్రత్తలు పాటించాలి.



మృతదేహంతో సర్పంచ్ ఇంటి వద్ద ఆందోళన



శివారెడ్డి మృతదేహంతో సర్పంచ్ ఇంటి వద్ద బంధువుల నిరసన

బాపట్ల: అనుమానాస్పదంగా మృతిచెందిన రావి శివారెడ్డి మృతదేహంతో అతని బంధువులు స్థానిక సర్పంచ్ ఇంటి వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. శివారెడ్డి మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పాత నందాయపాలెం గ్రామానికి చెందిన రావి శివారెడ్డి(31) గురువారం ఉదయం అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానిక సర్పంచ్ కుమారుడు శ్రీనివాసరెడ్డితో పాటు మరో ఇద్దరు కలసి తన కుమారుడిని చంపారని శివారెడ్డి తల్లి వెంకాయమ్మ ఆరోపించారు.

శుక్రవారం ఉదయం శివారెడ్డి మృతదేహాన్ని బంధువులు సర్పంచ్ ఇంటి వద్దకు తీసుకొచ్చి ఆందోళనకు దిగారు. మృతికి గల కారకులను కఠినంగా శిక్షించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాపట్ల సీఐ వేణుగోపాల్‌రెడ్డి, కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. దోషులను చట్ట ప్రకారం శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని మృతుని బంధువులకు హామీ ఇచ్చారు. అనంతరం శివారెడ్డి బంధువులు మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

బీరులో పురుగు మందు కలుపుకుని..

భట్టిప్రోలు: మద్యానికి బానిసైన ఓ యువకుడు బీరులో పురుగు మందు కలుపుకుని బలవన్మరణానికి పాల్పడి.. చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. భట్టిప్రోలు పీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కథనం మేరకు.. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలేనికి చెందిన బేతాళ ప్రసాద్(32) ఈ నెల 17న బీరులో పురుగు మందు కలుపుకుని తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక వైద్యశాలకు అతనిని తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించగా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

మృతుడు ప్రసాద్ తల్లి వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

సోషల్ ఆడిట్‌పై సీఆర్పీలకు శిక్షణ

పిట్టలవానిపాలెం: విద్యా వనరుల కేంద్రంలో సోషల్ ఆడిట్‌పై శుక్రవారం సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రస్థాయి రీసోర్సు పర్సన్, మంతెన వారి పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోషల్ ఆడిట్ నిర్వహణపై సమగ్ర శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వి.వెంకటేశ్వరరావు, సీఆర్పీలు కమల, ముసలయ్య, స్రవంతి ఉన్నారు.